

# స్వయంకృతం

కంఠస్ఫూర్తి సుబ్బరాజు

లోకమంతా నిద్రాదేవత ఒడిలో సేదదీర్చుకుంటున్న సమయం, అమావాస్య చీకటి తెరలతో అంధకార బంధురమైన వేళ, కళ్ళు మూసుకొన్న ఆ పల్లెటూరిలో మోతుబరి కామయ్య మేడమీది గదిలో ఆకలిగొన్న ఆంబోతులా పచార్లు చేస్తున్నాడు. అయిదు నిమిషాల కొకసారి కిటికీవద్దకు వెళ్ళి ఎవరి కోసమో ఎదురు చూస్తూ నిట్టూర్పులు విడుస్తున్నాడు. చివరకు విసుగెత్తి ఈ మధ్యనే తెప్పించిన కొత్తరకం సిగరెట్టు వెలిగించి సోఫా లాంటి కుర్చీలో కూర్చున్నాడు. టేబిలుమీద ఫేను గిరగిరా తిరుగుతున్నా కామయ్య ఒంటిమీది లాల్చి చెమటతో తడుస్తూనే వుంది. తెల్లటి స్వచ్ఛమైన ట్యూబులైటుకాంతిలో కామయ్య చేతికున్న ఉంగరాలు తళతళా మెరుస్తున్నాయి. గోడమీద బలిసిన ఒక బల్లి ఒడుపుగా ఆదమరచి వున్న ఒక అల్ప జీవిని అందుకొని తృప్తితో తరలిపోయింది. ఆ దృశ్యాన్ని చూసిన కామయ్య పెదవిపై చిరుమందహాసం తళుక్కుమని కాంతులీనింది. కామయ్యలేచి మరలా కిటికీ వద్దకు వెళ్ళాడు. మేడకు ఎడంగా పశువుల దొడ్లో లైటు వెలుగుతోంది. ఏపుగా పెరిగిన గానుగ చెట్టుపై రాత్రి పక్షులు చేసే శబ్దాలు వింతగా వినబడుతున్నాయి. దూరాన చీకటిని చీల్చుకుంటూ కనపడుతూన్న టార్చిలైటు కామయ్య కళ్ళలో కాంక్షను రేకెత్తించింది. ఉత్సుకతతో చూస్తూ ముఖం మీద చెమటను జేబు రుమాలుతో తుడుచుకున్నాడు. క్రమంగా లైటు కాంతి దగ్గరపడింది. కామయ్య మేడమెట్లు దిగి వసారాలోకి వచ్చాడు. భార్యాపిల్లలు పడుకునే గది ఖాళీ వుండటం చూసి, ఉదయం భార్య, పిల్లలతో పుట్టింటికి వెళ్ళడం జ్ఞాపకం తెచ్చుకున్నాడు.

రాజయ్య గేటు తెరచుకొని భుజంమీద పెనుగులాడుతున్న వ్యక్తితో వసారాలోకి వచ్చి ఆ వ్యక్తిని క్రిందికి దింపాడు. "తెచ్చాను దొరా" అంటూ రొమ్ము విరుచుకొని ఆ వ్యక్తి చేతికట్లు విప్పి నోట్లోని గుడ్డలు తీసివేశాడు.

ఇక మీ యిష్టం దొరా, తెగపెనుగులాడింది. దీని సిగతరగా. దీని మిడిసిపాటంతా ఈయాలొదిలేయాలి. కామయ్యదొర కన్నేయ్యడం, ఈ రాజయ్య వదిలిపెట్టడమూనా" రాజయ్య బలంతో కామయ్య కళ్ళు ఎరుపెక్కాయి. ఒక్కసారిగా ఒళ్ళు విరుచుకొని వికటాట్టహాసం చేశాడు. ఒక్క లేడిని మెక్కబోతున్న వ్యాఘ్రంలా గాండ్రించి రాజయ్యను వెళ్ళిపొమ్మని సైగచేశాడు. విజయగర్వంతో మీసం మెలివేస్తూ రాజయ్య వసారా దాటి వీధి అరుగుమీద కూర్చుని చుట్ట వెలిగించాడు. రాజయ్య మనస్సులో రకరకాల ఆలోచనలు విరుచుకుపడుతున్నాయి. ఆలోచనల్ని అదుముకుంటూ తన ప్రతాపానికి తానే మురిసిపోయాడు రాజయ్య.

ఏమే! ప్రొద్దుట ఈసడించి వెళ్ళిపోయావు కదూ! ఈ కామయ్యంటే ఏమను కున్నావే, ఇప్పుడెవరడ్డొస్తారే నీకు." కామయ్య ముందుకురికి పైకి లేవబోతున్న సీతాలు జబ్బలు పట్టుకున్నాడు.

ఛీ! ఛీ! వదులు. పాపిష్టోడా, వదలవా! ఏ నాటికైనా మీ పాపం పండుతుంది. మా ఉసురు తగిలి రక్తం కక్కుకొని చస్తారు. సీతాలు కామయ్య చేతిని బలంగా కొరికింది. అబ్బా! ఎంతపని చేశావే దొంగలం... నిన్నేం చేస్తానో చూడు. కామయ్య ముఖం కామం, క్రోధం సమ్మేళనమై బుసలు కొట్టింది. విసురుగా కాళ్ళలో కాళ్ళు పెట్టి సీతాలును క్రిందికి పడగొట్టాడు, అంతే కామయ్య బలమైన బాహువుల్లో సీతాలు చేజిక్కిన చిలకయింది. సీతాలు, ప్రయత్నాలు పెట్టిన కేకలు అరణ్య రోదనంలా వ్యర్థమయ్యాయి. అమ్మో అంటూ మేడంతా మార్మోగిన ఆక్రందన. సీతాలు కామయ్య కామాగ్నికి ఆహుతయినట్లు రాజయ్య మరోసారి మీసం దువ్వుకున్నాడు.

* * *

కామయ్య ఆ ఊరికి మకుటంలేని మహారాజు. కామయ్యను కాదని, బ్రతికి బట్ట కట్టినవాడు ఆ ఊరిలో ఇంతవరకు ఎవ్వడూ లేడు. ఇక ముందు ఉంటాడన్నదీ మా కూడా లేదు. సర్పంచ్ చంద్రయ్య, మునసబు అప్పలనాయుడు తదితర పదవులున్న పెద్ద మనుషులంతా కామయ్య చేతిలోని కీలుబొమ్మలయితే, పెద్దపాలేరు, రాజయ్య కామయ్యకు కుడిభుజమే కాక, కామయ్య పరోక్షంగా చేసే చీకటి దురాగతాలకు ప్రత్యక్ష నిదర్శనం. కామయ్య నెవరన్నా పల్లెత్తు మాటన్నారంటే రాజయ్య చేతిలో వాళ్ళు పుచా దెబ్బలు తినాల్సిందే. రాజయ్య సుమారు ఆరడుగుల మనిషి. ఆంబోతు మోపురంలాంటి ఛాతి. మెలిదిరిగిన కండరాలు. జబ్బల బనీను, పంచెకట్టు మెడలో తాయెత్తు, ఎప్పుడూ చేతిలో ఉండే ఆరడుగుల బాణాకర్ర. మనిషినొకసారి చూస్తే మరలా మర్చిపోలేం. రాజయ్య వస్తున్నాడంటే అందరికీ హడలే. అర ఫర్లాంగు దూరం వినబడే కిర్రు చెప్పుల ధ్వని రాజయ్య రాకను ముందుగానే తెలియపరుస్తుంది.

తెలవారు జామునే పొలానికి పోతున్న రాజయ్య చెరువుగట్టు మీద గుమికూడిన జనాన్ని చూసి దగ్గరకు నడిచాడు. గుంపులోనుండి ఎవరివో ఏడుపులు. పెడబొబ్బలు వినవస్తున్నాయి. నలుగురూ నాల్గు విధాల మాట్లాడుకుంటున్నారు. రాజయ్య గుంపును తప్పించుకొని లోనికెళ్ళి చూశాడు. సీతాలు... చెరువులోపడి ప్రాణాలు తీసుకుంది. రాజయ్య మెదడు మొద్దుబారిపోయింది. మెడవరకు గుడ్డకప్పారు. ముఖం ఉబ్బి పోయిభయంకరంగా ఉంది. గుంపులో రాజయ్యను కొంతమంది భయంగా మరికొంత వింతగాను చూశారు.

రాజయ్య గుంపునుండి మారు మాట్లాకుండా వచ్చేశాడు. పొలంవేపు నడుస్తున్నాడేగాని మనసంతా సీతాలు ఆలోచనతో సతమతమవుతూంది. "సీతాల్ని తన చేతులమీదనే చంపేశాడు. చేసింది పాపమేనేమో. రాజయ్య మనస్సు పాప పుణ్యాలమధ్య కొట్టాడుతోంది. పౌరుషంగా సీతాలు నిన్న పొలంలో చెయ్యి పట్టుకుంటే పల్కిన మాటలు జ్ఞాపకానికొచ్చాయి.

"ఛీ! పనికిమాలిన సచ్చినోడా! డబ్బుకు కక్కుర్తిపడి నీ యజమానికి లొంగమంటావా! అడికి బుద్ధి లేకపోతే నీకైనా లేదా! దున్నపోతులా ఉన్నానని ఏం జేసినా చెల్లుతుందనుకుంటున్నావేమో. మర్యాద దక్కదు. నీకే ఓ ఆడకూతురుండి. ఎవడయినా ఇలాగే అడిగితే ఎలాగుంటది నీకు. అడు చేసే యెధవ పనుల్కి, అగ్గిదేవుడికి వాయుదేవుడిలా నీ బలాన్ని ఉపయోగిస్తున్నావ్. ఛీ,ఛీ," విస విసా నడిచి పోయింది. దీని సిగ తరగా! ఎంత అభిమానం అనుకున్నాడు తను.

ఏరా! రాజయ్య తెగ నీలుగుతుందిపిట్ట కావాలంటే మరో పది రూపాయలు పారేద్దాం రాత్రికి రమ్మను కామయ్య గట్టుమీద కూర్చొని కేకేశాడు.

పది రూపాయలు పారేత్తే పడే పిట్ట కాద్దొరా దీని సిగ తరగా! ఎంతేసి మాటలంది. అసలు సంగతి మీకు తెలియద్దొరా! రేపు లగ్గాల్లో దాని పెళ్ళి. అందుకే ఇంత మిడిసిపాటు. మీరుండండి దొరా! దీని పొగరణచి రాత్రికి మీ కాళ్ళకాడ పడెయ్యకపోతే నా పేరు రాబందుల రాజయ్యే కాదు.

ఏరోయ్! రాజయ్య. దారి తప్పిపోతన్నావేటి! అగ్గిపెట్టుందా నీకాడ "కలుపు మొక్కలు పీకుతున్న సుబ్బడు కేకతో బాహ్యలోకంలోనికి వచ్చాడు రాజయ్య. అప్పటి కప్పుడే కూలీలంతా వేరు వేరు మడుల్లో కలుపు తీస్తున్నారు. సుబ్బడికి అగ్గిపెట్టిచ్చి అన్యమనస్కంగా తుమ్మ చెట్టుక్రింద చతికిల పడ్డాడు. కలుపు తీస్తున్న కూలీల పల్లె పదాలు కర్ణపేయంగా వినబడుతోన్నా రాజయ్య మనసు ఒంటరిగా మదన పడుతోంది. అంతరాత్మ గొంతెత్తి హెచ్చరిస్తున్నట్లని పించింది. "సీతాలు విషయంలో నీవు చేసిన పాపం ఘోరమైంది. అది కార్చిచ్చులా ఏ నాటికైనా నిన్ను దహించక మానదు. నీ పాపానికి ఫలితం అనుభవించి కళ్ళు తెరిచేరోజు వస్తుంది." అంతరాత్మ ఘోషకు అదిరి పడ్డాడు రాజయ్య.

ఆఁ పాపం, పుణ్యం. ఎన్నిసార్లు హెచ్చరించలేదు నువ్వు! కామయ్యను ఎదిరించి నీతి పాఠాలు వల్లించబోయిన ఎలిమెంటరీ స్కూలు క్రొత్తమాస్టారు తల బ్రద్దలు కొట్టినప్పుడు ఇలాగే వల్లించావు. గ్రామ దేవత ఉత్సవాల్లో పేరయ్య కూతురు పీకనొక్కి అనుభవించినప్పుడు

ఇలాగే హెచ్చరించావు. ఊరి ఎలక్షన్లగొడవల్లో ఎదురు పార్టీ పల్లె జనాన్ని లోబరుచు కుందని, యజమాని ఆజ్ఞమీద ఇళ్ళన్నీ తగలబెట్టినప్పుడు, వాళ్ళ ఉసురు తగులుతుందని భయపెట్టావు. ఎన్నిసార్లు హెచ్చరించలేదు నువ్వు." రాజయ్యలో మరోరూపం ముందుకొచ్చి పలికింది. పుడమిలో పుట్టిన ప్రతిమనిషిలోను మంచితనం మూర్తీభవించి ఉంటుంది. పరిస్థితులు, పరిసరాలు విషపూరితాలైనప్పుడు, మానవత్వం మరుగున పడి దానవత్వం విజృంభిస్తుంది. మంచితనం హరించుకు పోతుంది. అయినా మనసు మంచీ చెడుల మధ్య ఒంటరిగా ఊగిసలాడుతున్నప్పుడు మానవత్వం ముందుకొచ్చి మేల్కొందామన్నా దానవత్వమే పై చేయిగా దాడిచేస్తుంది.

రాజయ్య అలాఎంతసేపు కూర్చున్నాడో గాని చెట్టుమీద పిట్ట ఒకటి రెట్టవేయడంతో దులుపుకొని లేచాడు. ఆలోచల్ని విదిలించుకొని పంటకాలవ నీళ్ళలో ముఖం కడుక్కున్నాడు. "ఎన్నిపన్లు చేస్తేనేం! కామయ్య దొరకు, తనంటే ఎంత యిది! ఎంత అభిమానం. పెళ్ళిచేసుకుంటాను దొరా అంటే ముచ్చటిపడి మూడొందలిచ్చాడు. ఇల్లు కూలిపోయిందంటే కట్టుకోవడానికి కలప సాయంచేశాడు. ఇచ్చే జీతంకాక అడిగినప్పుడల్లా పదో పరకో ఇస్తూనే ఉంటాడు. కామయ్య దొర కమతంలో తన మాటకు తిరుగేలేదు. రాబందుల రాజయ్యంటే కల్లుపాకలు మొదలు కరణంకిష్టప్ప వరకు జడుస్తారు. రాజయ్య తలపాగ విప్పిముఖం తుడుచుకొని దూరాన రంగి చల్దిముంత పట్టుకొని రావడం చూసిన తృప్తితో తుమ్మచెట్టు వైపు నడిచాడు.

* * *

రంగి తెచ్చిన చల్దిముంత దగ్గర పెట్టుకొని పచ్చిమిరపకాయ నములుతూ అన్నంతింటున్నాడు రాజయ్య. రంగి గట్టుమీద కందికాయలు కోసి మూటకట్టింది. సూర్యుడు తీక్షణమైన కిరణాలతో మెల్లెక్కుతున్నాడు. కామయ్య దొరవచ్చే వేళయిందని రాజయ్య త్వరత్వరగా అన్నం తిననారంభించాడు.

"ఎంది మాఁవా! ఈయాల అదోలాగున్నవ్. ఏంటయ్యింది!"రంగి, రాజయ్యప్రక్కన కూర్చొని భుజంమీద చెయ్యేసింది.

"ఉండెనే! ఏంలేదుగాని! మద్దెపేలకి ఏం కూర చేత్తన్నావ్, మట్టగిడసలిగురొండె! చాల్రోజులయింది మట్టగిడసలు కూరతిని,"రాజయ్య చల్దిముంత ఎత్తి పట్టుకొని త్రాగాడు.

"మట్టగిడసలంటే గేపక మొచ్చింది మాఁవా!

# ఏది పథం

— నజర్

ఎటుజూచిన అంధకారం – ఎటుజూచిన మందభాగ్యం
వినుపించును ఆర్తరవం – కనుపించును ఆర్తజనం
పెరుగుచున్న జనసంఖ్యకు – తరుగుచున్న ధనసాంద్రకు
సమతలేదు సామ్యమెట్లు – ప్రజల బ్రతుకు దీర్పుటెట్లు ?
పెరుగుచుండె బ్రతుకు బరువు – పెరగదాయె ప్రజల బ్రతుకు
పెరిగిపోవు ధరలజాడ – తరుగుచుండె బ్రతుకు తీపి
నేటిదినం కూటికొరకు – వేటుపడిన పక్షిలాగ
వేన వేలుకుందు చుండ్రి – వేదనలో మునుగుచుండ్రి
ప్రజలుపడే బాధచూడ – పలుకురాదు మనసు విరుగు
ప్రజల బరువు తరుగుటెట్లు – ప్రజల బ్రతుకు తీర్పుటెట్లు ?
ప్రగతి పథం అంటారు – పరుగులు పెడతారు
పలవరింత మిగులుతుంది – ఫలితం కనుపించదు
క్రాంతిపేరు మ్రోగుతుంది – శాంతిమాట వినిపించదు.
ప్రజలు బ్రతుకు తీర్పుటెట్లు – తెలియదయ్యె చేయుటేమి ?
ప్రాజెక్టుల ఫలంలేదు – పాలసీల బలంలేదు
ప్రభుతయన్న భయంలేదు – అధికారుల కదుపులేదు
మించుధరల నిలుపులేదు – పెంచువారి కులుకులేదు
అవినీతికి ఆటపట్టు – బ్రతుకు బాట కెదురుకట్టు
బ్రతుకు బరువు పెరుగుచుండె – బ్రతుకు తీపి తరుగుచుండె
బ్రతుకుకంటె చావుమేలు – పలవరింత ప్రబలిపోయె
ప్రజల బ్రతుకు తీర్పుటెట్లు? – ప్రజలు సుఖము బడయుటెట్లు?
ఏది పథం, ఏది విధం – ప్రజల బ్రతుకు తీర్పుపథం.

ముసలయ్యకూతురు సీతాలులేదూ ! నిన్నటివరకూ బాగనే వుంద. ఏంవొచ్చిందో ఏమో, రాత్రికాడ పెద్ద చెరువులోపడి పేణాలు తీసుకుంది. వళ్ళంతా రక్కులు రకతంవూనూ. ఎవడో పగబట్టి పేణాలు తీశాడని కొందరు. పెద్దమ్మోరు కోపమొచ్చి సంపేసిందని కొందరు నోటికొచ్చినట్టను కుంటున్నారు తాటిమోపుకాడ రత్తమ్మ కొడుకు ఈపని రాజయ్యే చేసిండన్నాడు. నాకు చిర్రెత్తుకొచ్చి నామావ అలాటోడు కాదని నాలుగు దులపరించొచ్చేశాను" రంగి పైటకొంగుతో కళ్ళు అద్దుకుంది.

రత్తమ్మ కొడుకన్నాడా ! వీడిసిగతరగా ! ఆడి నాలిక చీరేత్తాను. అదిసర్లే దాని కాలమొచ్చి అది పోయింది. మద్దెన నీకెందుకే" రాజయ్యకు చిరాకు కలిగింది.

నాక్కాదు మావా ! రేపు లగ్గాల్లో దాని పెళ్ళి కూడా సేద్దాం అనుకున్నరంట. ఎవడు తీసుకున్నాడో ఉసురు మరి. ఆడి ఒళ్ళు పురుగులుపట్టా! ఎవడో పోలీసులకు కబురెట్టమంతె. మున్సుబుబాబు బయపెట్టి అక్కొత్తై ఆరాలు తీసి మువ్వతిప్పలు పెట్టారు. శవాన్ని తీస్కుపొమ్మన్నాడంట. కలికాలం కాకపోతే, మరేంటి" రంగి చెమ్మగిల్లిన కళ్ళను మరోమారు తుడుచుకొంది. చల్దిముంత తీసుకొని కాలవనీళ్ళతో కడిగింది. రాజయ్యబనీను లోని చుట్టతీసి అగ్గిపెట్టె తీసి వెలిగించాడు.

మావా ! నువ్వు కోపగించనంటే ఓ మాట చెపుతా ! మీ కామయ్య దొరకాడ కమతం మానెయ్ కూడదూ ! ఊళ్ళో ఏం జరిగినా అందరూ విన్నే ఆడిపోసుకుంటన్నరు. కామయ్య ముఖం చూసి ఊరుకుంటన్నరంట. పేరయ్య కూతురు పీకనొక్కింది నువ్వేనంట నిజం మావా ! నువ్వు పని మానెయ్ ! హాయిగా మా అమ్మగారి ఊరు పోదాం. మీ దొరకూడ మంచోడు కాదు మావా ! మొన్న చెఱువు నుంచి పోతంటే 'ఏంవే రంగి ! ఎగిసి పడిపోతున్నావ్ ! రాజయ్యొక్కడూ సరిపోతన్నడా నీకు' అన్నాడు పేణం సచ్చినంత పనయింది "రంగి చెప్పడం ఆపి రాజయ్య ముఖం లోనికి చూసింది

"చాల్లె ! హె ! దీని సిగ తరగా ! పీ ఒట్టి బయంపే కాని మరేందిలేదు. కామయ్య దొరకు మనమంటే ఎంత అపేక్ష ! ఎంత దయ. కామయ్య దొరంటే ఎవరనుకున్నావే ! ఆయన కెంత పేరుందో, ఎంత బలగముందో నీకేటి తెల్సు. మీసమున్న మొగోడు ఎవడయినా సరే రమ్మను నల్లిని నలిపినట్టు నలిపి రకతం తాగేత్తాను ఎట్టి బయాలు పెట్టుకోక ఎళ్ళెళ్ళు. అద్గో దొరొత్తన్నడు "రాజయ్య పంచె ఎగబెట్టి మడిలోకి దిగాడు. ఏంవే రంగి ! మా రాజయ్యతో ఎట్టపగలు కూడ మంతనాలాడుతున్నావ్" కామయ్య దూరంనించే పలకరించాడు

ఆఁ ఏంవిలేద్దొర ! దానికి మీరంటే తగని భయమండీ ! ఈయాల సీతాలు చెఱువులోపడి సచ్చిపోయిందట దానిగురించి ఒకటే యిదిగా చెప్పుకు పోతోంది" రాజయ్య సమాధానమిచ్చాడు

భయమెందుకే ! నేనేం నిన్ను మింగేస్తానా ! భలేదానివే. "కామయ్యను తప్పించుకొని రంగి మాట్లాడకుండా వెళ్ళిపోయింది. రంగి వెళ్ళినవైపు కామయ్య కామం నిండిన కళ్ళతో చూస్తూపెదాలపై విరిసిన చిఱునవ్వును కప్పివేస్తూ సిగరెట్టు వెలిగించాడు. సీతాలు...అయ్యోపాపం. కామయ్య కళ్ళు మిటకరించి నవ్విన నవ్వుకు రాజయ్య పెద్దగా శ్రుతికలిపాడు. వాళ్ళ నవ్వుల కర్థం తెలియక ప్రక్క మడుల్లోని కూలీలు వింతగా చూశారు. కామయ్య గట్టుమీద నడుస్తూ పొలాన్ని పరీక్షిస్తున్నాడు రాజయ్య వివరంగా ఆ యేడు పంటరాబడి గురించి చెప్తున్నాడు.

అది సరే రాజయ్యా ! ఈ రోజు నువ్వు బస్తీకి పోయి పదిబస్తాలు అమ్మోనియా తీసుకురావాలి నిన్ననె డబ్బు పంపించాను. నువ్వు మన కోడెద్దుల బండి కట్టుకొని వెళ్ళు. సమితాఫీసు ప్రక్కనే ఉంది పెద్దకొట్టు. బండిమీద బస్తాలు వేయించేసి, హోటల్లో భోంచెయ్యి. తిరిగ్గా రెండాటలు సినిమాలు చూసి బయల్దేరి వద్దువుగాని. తొందరేం లేదులే నెమ్మదిగా రా, వెళ్ళేటప్పుడు చీటీ ఒకటి రాసిస్తాను. మధ్యాహ్నమే బయలుదేరి వెళ్ళు.' కామయ్య చెప్పడం ఆపి మరో సిగరెట్టు వెలిగించాడు.

"అట్లాగేదొరా! బస్తీపోయి చాల్రోజులయింది మన కోడెద్దుల్ని కట్టానా నా సామిరంగా కొండనైనా ఎత్తుకొచ్చేస్తా ! రాజయ్య ఉత్సాహంతో అన్నాడు. సరే ! నేనలా కొంతపొలం దాకా పోయొస్తాను. వాళ్ళను జాగ్రత్తగా చూస్తుండు," కామయ్య ముందుకు నడిచాడు.

* * *

దట్టమైన చీకటి పట్టుదలగా రాజ్యమేలుతోంది చీకటి నెదురిస్తూ నక్షత్ర గుంపు నాల్గుదిశలా తమ శక్తికొలది వెలుగును ప్రసరింప చేస్తున్నాయ్ దేవాలయం ప్రక్కగా ఊరకుక్కలు ఉండుండి గోలపెడ్తున్నాయి.

దేవాలయంలోపల పురాణం శాస్త్రిలుగారి గొంతు బిగ్గరగా వినపడుతోంది. ఆ చీకటిని చీల్చుకుంటూ తెల్లటిబట్టలు వేసుకున్న ఓ నల్లటి వ్యక్తి నక్కుతూ నక్కుతూ నడుస్తున్నాడు. తన నెవరైన చూడటంగాని, అనుసరించటంగాని జర్గుతుందేమోనని భయంగా వెనక్కి ముందుకు చూసుకుంటున్నాడు. త్వరగా నడవటోయి ప్రేమతో ముద్దుపెట్టుకున్న రోడ్డుమీది కంకర రాయిని కసిదీరా తిట్టుకున్నాడు. రోడ్డుదాటి చిన్న చిన్న గుడిసెల్ని వదిలి, గుడిసెకంటె పెద్దదైన ఓ యింటి చూరులోకి దూరాడు.

నులకమంచంపై కలలు కంటు పడుకొన్న రంగి తలుపు తడుతున్న శబ్దం విని తటాలున లేచింది. ఎందుకో ఆమె గుండె దడదడా కొట్టుకుంది. గూటిలోని చమురు దీపంవత్తిహెచ్చించి ముందుకు నడిచింది. మావ రాజయ్యయితే "రంగి" అనిపిలుత్తాడే ఎవరబ్బా!" ఆమె మనసు పరిపరి విధాల ఆలోచనల్తో ఉక్కిరిబిక్కిర యింది. తలుపుమీద శబ్దం ఇంకా వినబడుతూనే ఉంది. తలుపు తీయకూడదనుకుంటూనే గెడపైకి లాగింది. చమురు దీపం వెలుతుర్లో తెల్లటిబట్టల్తో లోనికొచ్చి తలుపుబిగించిన ఆగంతకుని చూసి రంగి కొయ్యబారిపోయింది. తడారిపోతున్న నాలికను అదుపులోనికి తీసుకొని "మీరా దొర" అంది.

"అవునులే నేనే , నీమీద ఎంతకాలం నుండి మనసు పెట్టుకున్నానో తెలుసా !" కామయ్య కళ్ళలో కాంక్షవరద పొంగులా ఉబికింది. రంగి భయంతో నిలువెల్లా వణికింది.

దొరా ! మీ కాలికింద నీళ్ళతాగే ఓళ్ళం. ఇది మీకు నాయంవా" రంగి ఒకడుగు వెనక్కి నడిచింది.

ఏంవిటే నీతులు చెప్తున్నావ్ ! మనసుపడి వస్తే రాజయ్యకుతెలియనివ్వనులే"." కామయ్య విసుగుతోపాటు కళ్ళు ఎరుపెక్కి ముందుకు నడిచాడు.

ఛీ, ఇందుకా నా మావను బస్తీకి పంపించావ్ ! నీ నీచపు బుద్ధి తెలిసింపంటే నా మావ నిన్ను ముక్కముక్కలుగా నరికేస్తడు. మర్యాదగా ఎల్లిపో ముందుకొచ్చావా ! కేకలేసిఅందర్ని



పిలిపిస్తా !" రంగి గోడకు చేరగిలబడింది. ఏడి కావ్ ! లే! కామయ్య గూటిలోని దీపాన్ని చేత్తో ఆర్పేశాడు. నోరెత్తి కేకపెటబోతున్న రంగిపై పడి పీకపట్టుకొని క్రిందపడవేశాడు. కామయ్య కబంధ హస్తాలురంగిమెడచుట్టూ బిగుసుకున్నాయి. శరీరంలోని భాగాల్ని చీల్చుకు తింటూంటే గిల గిలా కొట్టుకునే కోడిపిల్లలా రంగి కామయ్య చేతుల్లో గిజ గిజా తన్నుకుంటోంది. కొంత సేపటికి ఏమయిందో ఏమో మాట్లాడలేక కాళ్ళు తన్నుకుంటూ 'మావా' అంటూ మూలిగింది. అచేతనంగా పడి, తన శరీరంపై దాడి చేస్తున్న కామయ్యను ఎదిరించలేక వెక్కి వెక్కి పడుతోంది. అంతే చీకటిలో దౌర్జన్యం విజయతాండవం చేసింది. కామం బుసలుకొట్టి ఓ ఆడపడుచును కాటేసింది. దిక్కులేని పక్షి ఒకటి దారుణమైన దెబ్బతగిలి కొన ఊపిరితో కొట్టుకుంటోంది. కోర్కె తీరిన కామయ్య తలుపు తీసుకొని తృప్తిగా చీకటిలో కలిసి పోయాడు.

* * *

తృప్తిగా హోటల్లో భోంచేసి తాను చూసిన మొదటి ఆట సినిమా దృశ్యాన్ని నెమరు వేసుకుంటూ బండిదగ్గరకు నడిచాడు రాజయ్య. 'సినిమాలో', ఒంటరిగా ఉన్న ఆడదాన్ని నానా హింసలు పెట్టి ఆమె భర్తజాడ తెలుసుకోవడం కోసం ఆమెను చివరకు దారుణంగా హత్యచేసిన దొంగరూపం రాజయ్య కళ్ళముందు మెదిలింది. దానితోబాటు నిన్నరాత్రి సీతాల్ని తను బంధించి కామయ్య కప్పచెప్పడం గుర్తుకొచ్చింది. సినిమాలో దొంగకు, తనకు తేడా ఏం వుంది? అనుకున్నాడు రాజయ్య. తనలాగే తన రంగిని ఒంటరిగా ఉండటం చూసి ఎవరైనా... రంగి జ్ఞాపకం రావడంతో రాజయ్య పెనుగాలికి ఊగిన లాడ వటవృక్షంలా చలించిపోయాడు దాంతోపాటు తను బస్తీకెళ్తాసంటే రంగిభయంతో పలికిన మాటలు జ్ఞాపకమొచ్చాయి.

మావా! సుబ్బొచ్చేదాకా. బిక్కు బిక్కు మంటూ ఉండాలి. నాకసలే చచ్చేటంత భయం. పోని నేనూ రానా బస్తీకి "రంగి గారాలుగా గునిసింది.

ఎందుకే! తను విసుక్కున్నాడు. వెంటనే ధైర్యం చెప్పాడు.

ఏమో! మావా! నీ కోసం నిద్రపోకుండా కళ్ళల్లో దీపాలెట్టుకొని ఎదురు చూస్తా! "రంగిని వదిలి ఉండలేకపోతుంటుయి. కళ్ళల్లో మెదుల్తూన్న రంగిని తలుచుకుంటూ ఎడ్లను లేపి బండి కట్టాడు. ఉత్సాహంతో బండితోలి ఊరి పొలిమేర చేరుకున్నాడు రాజయ్య ఊరంతా నిశ్శబ్ద వాతావరణంలో నిద్రపోతూంది. ఊరి ముందు శ్మశానంలో సీతాల్ని దహనం చేసిన శవదహనం ఇంకా ముక్కు పుటాల్లోకి చొరబడుతోంది మనిషి చేసిన పాపాలు మరో జన్మెత్తి అనుభవిస్తాడంటారు! నిజమా! అబద్ధమా!" రాజయ్య మనస్సు రాస్సేపు తాత్త్విక దృష్టితో తొరట్లాడింది బండిని కామయ్య ఎదురుగుండా దొడ్డి దగ్గర నిలిపి ఎడ్లని విప్పేశాడు. అర్ధరాత్రిలో దొరను నిద్రలేపడమెందుకని తిన్నగా ఇంటివైపు నడిచాడు. ఇంటిముందంతా చీకటిగా వుంది. తలుపు తీసి వుండటం చూసి రాజయ్య "రంగీ" అంటూ పిలిచాడు. సమాధానంగా సన్ననిమూలుగు వినిపించింది. "రంగీ! ఏటయిందే? ఎక్కడున్నావ్?" రాజయ్య బనీనులోని అగ్గిపెట్టె తీసి గూట్లోని దీపం వెలిగించాడు. చమురు దీపం వెలుతుర్లో నక్కలు పీక్కుతిన్న శవంలాపడి మూలుగుతున్న రంగిని చూసి దిక్కులదిరేలా "రంగీ" అంటూ అరిచాడు. ముక్కముక్కలుగా చీలికైన బట్టలు, ఒంటినిండా గాట్లు, ఉబ్బిపోయిన మెడ, చెల్లాచెదురుగా పడి భయంకరంగా వున్న జుట్టు. రాజయ్య కళ్ళు బైర్లు క్రమ్మాయి. ఒంటినిండా ఎవరో వెయ్యి గునపాలు గుచ్చుతున్నట్టనిపించింది.

"రంగీ! రంగీ!" భోరుమంటూ రాజయ్య రంగిపై పడిపోయాడు. "ఎవడే వాడు? ఆడి నెత్తురు తాగుతా! ముక్కముక్కలుగా చిత్రవధ చేస్తా. రంగీ... చెప్పు రంగీ!" రాజయ్యలో ఉద్రేకం, ఆవేశం వేయి పడగలెత్తి బుసలు కొట్టాయి ప్రతీకారం రాజయ్యలో ప్రజ్వలించింది. రాజయ్య కేకలకు చుట్టుప్రక్కలవాళ్ళు మేల్కొని ఇంటిముందు చేరారు.

మావా "లోతైన నూతినుండి వినబడుతున్నట్టుంది ఆ స్వరం. నె సెప్తే ఇన్నావుకాదు. మేక వన్నెపులి. మీ దొర కామయ్య" రంగితల ప్రక్కకు వాల్చేసింది రంగీ! పిడుగు పడినట్టని వాడు రాజయ్య "కామయ్య దొర!" రాజయ్య కళ్ళలో అగ్నిగోళాలు బ్రద్దలవుతున్నాయి. ఆరని మంటలు రాజయ్యను దహించి వేస్తున్నాయ్! పళ్ళు పటపట మని కొరుకుతూ మూలనున్న గొడ్డలితో పరుగు పెట్టాడు రాజయ్య!

ఒరేయ్! కామయ్యా! నిన్నెనమ్మి - నువ్వు చెయ్యమన్న పనల్లా పాప పుణ్యాలను విడిచి పెట్టి చేసినందుకా నాకీ ప్రతిఫలం! నిన్నోమహారాజులా గౌరవించి, నువ్వాడిన ఆటకల్లా ఆటబొమ్మలా ఆడినందుకా నాకీ ప్రతిఫలం! న్యాయం, ధర్మం విడిచి రాక్షసుడిలా ఎందరోన్నిబలిచేసి నీకోర్కెలు తీర్చినందుకా నాకీ ప్రతిఫలం. నీ నిజ స్వరూపం తెలియక, నీ తీపి మాటలలో ఇంతటి స్వార్థం నీ ప్రేమ పలుకుల్లో ఇంతటి విషం ఉన్నాయని తెలిసికొనలేక నేడు నా సర్వస్వాన్ని పోగొట్టుకున్నాను. ఒరేయ్! నీ వెచ్చని రక్తం తాగుతారా! ఒరేయ్ కామయ్యా!" రాజయ్య మనసు దావానలంలా రగుల్కొని మండిపోతుంది ఒళ్ళు తెలియని ఆవేశంతో చీకటిలో కామయ్య రూపాన్ని కళ్ళలో నింపుకొని పరుగుపెడుతున్నాడు తీరని ఉద్వేగంతో పరుగుపెడుతున్న రాజయ్య కాలిపై జరజరమని ప్రాకిన జీవాన్ని గమనించలేక పోయాడు పాపం.

"ఒరేయ్! కామయ్యా! నిజమేనా! నే చేసిన పాపాలకు అంతులేదు పాప పుణ్యాల కర్థం తెలియక, అహంతో, అజ్ఞానంలో నా కళ్ళు నేనే పొడుచుకున్నాను నే చేసిన పాపం నన్నే కొట్టింది నా రంగిని దూరం చేసింది." రాజయ్యలో మరో రూపం పునరుదయించింది చేతిలో గొడ్డలితో రుద్రమూర్తిలావచ్చి ఒంటినిండా చెమటలు క్రమ్ముకొనగా "ఒరేయ్! కామయ్యా" అంటూ గేటుముందు పడిపోయిన రాజయ్యనుచూసి ఒక్కడుగు వెనక్కివేశాడు అత్తవారింటికి బయల్దేరి పోతున్న కామయ్య.

★

# ఫూల్స్

[12 వ పేజీ తరువాయి]

మాట్లాడుతున్నారు.

"పదిలక్షల బాబుగారికే జిందాబాద్" అనిలేబరు సరుకంతా తమకేమయినా దొరకబోదా అని తమ నోర్లని ఉపయోగిస్తున్నారు.

ఓ సినీస్టార్ వచ్చినంత సందడిగా వుంది వాళ్ళకి. రిక్షాతో పాటు అందరూ కదిలారు. రిక్షా వాడు బలే హుషారుగా పోనిస్తున్నాడు బండిని. అలా ఆ రిక్షా కనుమరుగై పోయింది.

'ఈ ఫూల్స్ లాటరీలు పేలుతున్నాయి. తనూ ఓ టికెట్టు తీసుకుంటే తృణమో, పణమో ముట్టకపోదా' అని బస్సు దిగా దొకడు. ఆ పాన్ షాపు వద్దే కిళ్ళీ వేసుకుంటూ అడిగాడు యిలా·

"ఇవ్వాటనే లాటరీ పేలిందట. ఇంతకీ ఎవరు? ఎవరా అదృష్ట జాతకుడు?"

"అయ్యో! అతని సంగతి మీకింకా తెలియదా!" ఆశ్చర్యపోయాడు కిళ్లీషాపు రాముడు.

"ఉండవయ్యా! నీవేం చెప్పక్కర్లే...! ఆ సంగతి నేచెబుతా. కాబోయే లక్షాధికారి అని గోల్డ్ స్పాట్ తెప్పించి యిచ్చి మర్యాద చేశా..."

షావుకార్లు ప్రవేశిస్తూ:

అబ్బా! మీ రాగండి. మాకు ఎంతగా [illegible] ఉన్నా లక్షాధికారి స్నేహం వుంటే చాలని - తిరిగి మాకు అప్పులు దొరుకుతాయని మా ప్రయాణాన్ని సహితం ఆపుకొని అతన్ని ఇంటిదాకా సాగనంపాము. కాని...

ఇంతలో 'పది లక్షల రాముడు' గారి అతి ముఖ్య సన్నిహితులు, ఆప్తులు, ఆపత్బాంధవులు కొంత మంది ఇసుకలా రాలుతూ వచ్చారు.

"అయ్యో బాబా! వాడట బస్సులోనే పేపర్ చూసేసి ఆ వెధవ ఫస్టుప్రైజ్ నెంబరు నోట్ చేసి ఏమీ తెలియనట్టు చూస్తున్నాడట. మా ఆశలన్నీ అడియాశలు చేసేశాడు. మేమెంతో కష్టపడి ఫిక్స్ చేసుకొన్న ప్రోగ్రామ్సన్నీ గాలిలో ఎగిరిపోయాయి. ఆఖరికి మా కలలన్నీ కల్లలై పోయాయి దొంగ గాడిద, అడ్డగాడిద, వాడు నిజంగా గాడిద కొడుకే. ఇంతా చూస్తే వాడి దగ్గర టిక్కెట్టూ లేదు, గిక్కెట్టూ లేదు. యూస్ లెస్ ఫెలో". ఉస్సూరుమంటూ వాపోసాగారు.

★